నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, గురువారం 9 మే 2024 | HYDERABAD



## ఎన్నికల విధులకు గైర్హాజరు..
# 40మందిపై వేటు

సిటీబ్యూరో, మే 8(నమస్తే తెలంగాణ) : ఎన్నికల విధులకు గైర్హాజరైన 40మంది పీవో, ఏపీవోలను జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ సస్పెండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోలింగ్ విధుల నిర్వహణ డ్యూటీలు, కేటాయించిన వివిధ శాఖలకు చెందిన 40మంది అధికారులు శిక్షణ తరగతులకు గైర్హాజరు కావడంతో పాటు, రిమాండ్ సమాచారం ఇచ్చిన స్పందన లేకపోవడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం ఉల్లంఘన కింద వీరందరినీ సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పీఓ, ఏపీవోలకు ఈ నెల 9,10 తేదీల్లో జరిగే మూడో దశ శిక్షణ తరగతులకు గైర్హాజరైన వారిపై ఇదే తరహా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## వేళకు ట్యాంకర్లు రావాలి



సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): జలమండలి పరిధిలోని పలు వాటర్ ఫిల్లింగ్ స్టేషన్స్‌ను ఎండీ సుదర్శన్ రెడ్డి బుధవారం సందర్శించారు. కొండాపూర్, మాదాపూర్, అయ్యప్పసొసైటీ, బంజారాహిల్స్, సోమాజిగూడ ఫిల్లింగ్ స్టేషన్స్‌ను పరిశీలించి ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్న నీటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ ట్యాంకర్ బుకింగ్, డెలివరీ టైమింగ్స్‌ను కచ్చితంగా లాగ్‌బుక్‌లో రాయాలన్నారు. 5 ఫిల్లింగ్ స్టేషన్స్‌లోని ట్యాంకర్ డెలివరీకి సంబంధించిన ఇన్ అండ్ ఔట్ లాగ్ బుక్స్ తనిఖీ చేశారు. రాత్రి సమయాల్లోనూ నీటి సరఫరా చేసి, ట్యాంకర్ల డెలివరీ సమయాన్ని తగ్గించాలని సూచించారు.



కేసీఆర్ రోడ్‌షోలో పాల్గొన్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తలు





ప్రసంగిస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

# సిటీ ఇమేజ్.. డ్యామేజ్

### రియల్ ఎస్టేట్ ఢమాల్.. పరిశ్రమలు తరలిపోతున్నాయి
### కరెంటు లేదు.. నీటి సమస్యలతో హైదరాబాద్ అతలాకుతలం..
### దుండిగల్ రోడ్ షోలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

మేడ్చల్, మే 8 (నమస్తేతెలంగాణ): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నదని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా దుండిగల్‌లో బుధవారం మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా కేసీఆర్ రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'హైదరాబాద్ నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయి. నగరంలో రియల్ ఎస్టేట్ పూర్తిగా ఢమాల్ అయింది. నీళ్లు లేవు, కరెంటు లేదు.. దీని కారణంగా అంతర్జాతీయంగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని పూర్తిగా దెబ్బతింటున్నది. లండన్, న్యూయార్క్ లో కరెంటు పోతదమో కానీ తెలంగాణలో రెప్పపాటు కూడా కరెంటు పోకుండా చేసి చూయించాం. మేము అధికారంలో ఉన్నప్పుడు భూముల రేట్లు ఎట్లుండే..ఇప్పుడు ఆర్‌ఆర్‌ఆర్ ట్యాక్స్ వచ్చాక భూముల రేట్లు ఏ విధంగా పడిపోయాయే ప్రజలు ఆలోచించాలి' అని కేసీఆర్ పేర్కొన్నారు. ట్రిబుల్ ఆర్ ట్యాక్స్‌పై వసూలు చేసి ఢిల్లీకి కప్పం కడుతున్నారని.. స్వయంగా దేశ ప్రధాని ఆరోపించిన విషయాన్ని కేసీఆర్ గుర్తు చేశారు. హైదరాబాద్‌లో కొద్ది పాటి వాన పడితేనే ఆరు గంటల కరెంటు పోయిన దుస్థితి నగరానికి వచ్చిందన్నారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కార్నింగ్ అనే పరిశ్రమ హైదరాబాద్‌లో వెయ్యికోట్లతో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దివాళ కోరు పరిపాలన విధానంతో.. అది చెన్నైకి తరలిపోయిందన్నారు. పరిశ్రమలు తరలిపోతున్న క్రమంలోనే ఐటీ రంగం పూర్తిగా కుదేలైపోయిందన్నారు.

### టైగర్‌లాంటి ఎమ్మెల్యేలు ఉన్నారు..

మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో టైగర్ లాంటి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారని కేసీఆర్ అన్నారు. కేపీ వివేకానంద్ 85 వేల మెజార్టీతో, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు 75 వేల మెజార్టీతో గెలిచారని, ఇదే స్ఫూర్తితో మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని 3 లక్షల మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ సభలో మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు తదితరులు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్ రోడ్‌షో కు పెద్ద ఎత్తున ప్రజలు, గులాబీ శ్రేణులు తరలివచ్చారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తన ప్రసంగంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను విమర్శిస్తున్న సమయంలో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.



కేసీఆర్ రోడ్‌షోకు హాజరైన అశేష జనవాహిని





పద్మారావునగర్‌లో విరిగిపడిన చెట్టు కొమ్మ, రాంనగర్‌లో జలమయమైన రహదారి

## మరో 2 రోజులు.. వానలు

తూర్పు విదర్భ నుంచి తెలంగాణ, రాయలసీమ, దక్షిణ అంతర్గత కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా, మంగళవారం దంచికొట్టిన వానతో నగర వాతావరణం కొంత చల్లడినప్పటికీ బుధవారం మధ్యాహ్నం ఎండలు మండిపోయాయి. వాన ప్రభావంతో మొన్నటి వరకు 43 డిగ్రీలు దాటి నమోదైన ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి దిగివచ్చాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 36.8, కనిష్ఠం 21.9 డిగ్రీలు, గాలిలో తేమ 47 శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

## 1100 మెగావాట్లు డౌన్..

ఒకే ఒక్క వర్షం విద్యుత్ శాఖ నెట్‌వర్క్‌ను అతలాకుతలం చేసింది. మహానగరంలో అంధకారం అలముకున్నది. ఒకేసారి 380 ఫీడర్ల పరిధిలో సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఫలితంగా అర్ధరాత్రి విద్యుత్ శాఖ యంత్రాంగం పనిచేసినా.. పూర్తి స్థాయిలో పునరుద్ధరించలేకపోయింది. బుధవారం ఉదయం వరకు వర్షానికి దెబ్బతిన్న లైన్లను సరిచేయడంలోనే నిమగ్నమయ్యాయి. ఫలితంగా 9 సర్కిళ్లలో విద్యుత్ పీక్ అవర్ డిమాండు 1100 మెగావాట్లకు పడిపోయింది. వాతావరణం చల్లబడటం, విద్యుత్ సరఫరాలో గంటల తరబడి అంతరాయంతో కరెంటు వినియోగం సైతం 77 మిలియన్ యూనిట్లకు తగ్గిపోయింది. గ్రేటర్‌లో చాలా చోట్ల ఫ్లెక్సీలు గాలికి ఊడిపోయి సమీపంలోని 33 కేవీ లైన్లపైనే పడటంతో వందలాది సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అర్ధరాత్రి వరకు 90 శాతం విద్యుత్ పునరుద్ధరణ చేయగా, బుధవారం ఉదయం పూర్తి స్థాయిలో సరఫరా జరిగేలా అధికార యంత్రాంగం నిరంతరాయంగా పనిచేసింది.

# ఒక్క వానకే 10 మంది మృతి

### భారీ వర్షంతో అతలాకుతలమైన నగరం
### ముందు చూపులేని అధికార యంత్రాంగం
### నగరంలో పలు చోట్ల అంధకారం
### బాచుపల్లిలో ప్రహరీ కూలి.. ఏడుగురి దుర్మరణం
### బేగంపేట నాలాలో రెండు మృతదేహాలు లభ్యం
### బహదూర్‌పురలో కరెంటు షాక్‌తో ఒకరి మృతి

సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ)/దుండిగల్/బేగంపేట: మండు వేసవిలో కురిసిన ఒక్క వర్షానికే నగరం అతులాకుతలమైంది. నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. వేర్వేరు ప్రాంతాల్లో 10 మంది మృత్యువాత పడ్డారు. మంగళవారం వర్షం వస్తుందని వాతావారణ శాఖ ముందే సూచనలు చేసినా.. అప్రమత్తంగా ఉండాల్సిన అధికార యంత్రాంగం నిద్రావస్థలో ఉన్నది. సాయంత్రం కార్యాలయాల నుంచి ఇండ్లకు వెళ్లే సమయంలో వానపడటంతో ఎక్కడికక్కడే ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈదురుగాలులతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సంబంధిత శాఖల నిర్లక్ష్యానికి భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. బాచుపల్లిలోని రేణుక ఎల్లమ్మ కాలనీలో నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్ గోడ కూలీ ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. ఇక్కడ సహాయక చర్యల్లో జాప్యం కావడంతో మృతుల సంఖ్య పెరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరో ఘటనలో బేగంపేట నాలాలో రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. బహదూర్‌పురలో విద్యుదాఘాతంతో ఓ యువకుడు చనిపోయాడు. ఇలా హైదరాబాద్‌లో ఒక్కరోజే కురిసిన ఒక్కవానకే నిండు ప్రాణాలు పోవడం ఆందోళన కలిగిస్తున్న అంశం.

### బిల్డర్‌పై హత్య కేసు..

బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రేణుక ఎల్లమ్మ కాలనీలో గోడ కూలి వలస కూలీలు మృతిచెందిన ఘటనలో బిల్డర్ అరవిందరెడ్డిపై హత్య కేసు నమోదు చేశారు. రేణుక ఎల్లమ్మ కాలనీలోని 2 ఎకరాల 17 గుంటల స్థలంలో బిల్డర్ అరవిందరెడ్డి హెచ్‌ఎండీఏ అనుమతులతో సెల్లార్ స్టిల్ట్+5 అంతస్తులతో అపార్ట్‌మెంట్‌లను నిర్మిస్తున్నాడు. హర్షనా రైజ్ అనే నిర్మాణ సంస్థ పేరిట నిర్మిస్తున్న ఈ బహుళ అంతస్తుల భవనం చుట్టూ ఇటీవల సుమారు 30 ఫీట్ల ఎత్తులో రిటైనింగ్ వాల్ నిర్మించారు. దీనిని ఆనుకుని బయటివైపు వలస కూలీల కోసం రేకుల గుడిసెలు ఏర్పాటు చేశారు. ఇక్కడ సుమారు 150 కుటుంబాలకు చెందిన కూలీలు నివాసముంటున్నారు. మంగళవారం కురిసిన వానతో మట్టిపలుచబడి కుంగడంతో పాటు వాననీరు బయటకు వెళ్లేదారి లేకపోవడంతో ఒత్తిడిపెరిగి రిటైనింగ్ వాల్ కుప్పకూలి గుడిసెల్లో ఉన్న కూలీలపై పడింది. దీంతో చిన్నారితో పాటు ఆరుగురు కూలీలు సజీవ సమాధి అయ్యారు. బాచుపల్లి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే విద్యుత్ సరఫరా లేకపోవడం, ఘటనా స్థలానికి వెళ్లే దారిలో గోడ కూలిపోయి ఉండటం, మరో దారి లేకపోవడంతో కాంక్రీట్, మట్టిలో కూరుకుపోయిన వారిని బయటకు తీయడంలో ఆలస్యం జరిగింది. సహాయక చర్యలు చేయడంలో మున్సిపల్ విభాగం, విపత్తుల నిర్వహణ శాఖ నుంచి ఎలాంటి సహకారం లేకపోవడంతో మట్టిలో కూరుకుపోయిన వారిని బయటకు తీయడానికి గంటల సమయం పట్టింది. చివరకు ఏడు మృతదేహాలు బయటపడ్డాయి. నాసిరకంగా రిటైనింగ్ వాల్ నిర్మించి ఏడుగురి ప్రాణాలు కోల్పోయేందుకు కారకుడైన బిల్డర్ అరవిందరెడ్డిపై హత్యకేసును నమోదు చేసినట్లు కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, బాచుపల్లి సీఐ ఉపేందర్ తెలిపారు. ఆయనతో పాటు సైట్ ఇంజినీర్ సతీశ్, ప్రాజెక్ట్ మేనేజర్ ఫ్రాన్సిస్, కాంట్రాక్టర్లు రాజేశ్, సింహాచలం, రాంరెడ్డి తదితరులపైనా కేసులు నమోదు చేశామన్నారు. కాగా, గోడ కూలి మృతిచెందిన వలస కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించినట్లు కార్మికశాఖ అధికారులు తెలిపారు.

### నాలాలో మృతదేహాలు..

కూకట్ పల్లి నుంచి బేగంపేట మీదుగా ప్రవహించే నాలాలో రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. బేగంపేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ జయచంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం బేగంపేటలోని కూకట్‌పల్లి నాలాలో రెండు మృతేహాలను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్గం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుల వద్ద లభించిన ఆధారాల ప్రకారం ఒడిశాకు ప్రాంతానికి చెందిన చంద్రపాండా(38,) మనోజ్ దాస్ (45) ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో ఓ గదిని అద్దెకు ఉంటున్నారు. అమీర్‌పేటలో ఓ హోటల్‌లో కార్మికులుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరిద్దరూ అమీర్‌పేటలోని ఓ హోటల్



డ్యూటీ ముగిసిన అనంతరం ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో గ్రీన్ ల్యాండ్ సమీపంలోని కంట్రీ క్లబ్ ఎదురుగా ఉన్న వైన్ షాపులో మద్యం తాగారు. ఇంటికి వెళ్తున్న క్రమంలో అప్పటికే భారీగా కురుస్తున్న వర్షంలో ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో రైలు పట్టాలు దాటుతుండగా నాలాలో పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదవశాత్తు నాలాలో పడ్డారా..? మరేదైనా కారణం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలాఉండగా బహదూర్‌పురలో ఫక్రుద్దీన్ అనే వ్యక్తి వర్షం పడుతున్న సమయంలో కరెంటు స్థంభాన్ని పట్టుకోవడంతో విద్యుత్‌ఘాతానికి గురై మృతి చెందాడు.

